క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించారు. అలాగే ఆ కథల్లోని నీతిని వివరించారు. అనంతరం విద్యార్థులతో ఆటలాడించారు. వారికి బిస్కెట్లు, చాక్లెటు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయాధికారి పీవి రమణ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: టెక్ మహేంద్ర సహకారంతో కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్‌లో 18 నుంచి 30 ఏళ్ల లోపు గల డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి ఉచిత శిక్షణ అందించనున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. హెల్త్‌కేర్ బిల్లింగ్, జీడీఏ కోర్సుల్లో 3 నెలలు ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వివరాలకు 7207953919, 7995013421 నంబర్లలో, షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ హాస్పటల్ ఆవరణలోని ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని కోరారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ పీఆర్ బిషోయి, జీఆర్‌పీ ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన పుగాజ్హేంది తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, రూ. 35 వేల విలువైన 7 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

40 కేజీల నిషేధిత ప్లాస్టిక్ పట్టివేత

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న వ్యాపార సముదాయాలపై జీవీఎంసీ ప్రతేక బృందాలు దాడులు చేసి 40 కేజీల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నాయి. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్‌లో హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు చేశారు. ఈ మేరకు ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు మాట్లాడుతూ మానవాళికి హాని కలిగించే ప్లాస్టిక్‌పై జీవీఎంసీ నిషేధం విధించిందన్నారు. అయినప్పటికీ వ్యాపారులు ప్లాస్టిక్ ఉపయోగిస్తూనే ఉన్నారన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు దొరికితే వెంటనే ఆయా దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మురళి, గంగాధర్ పాల్గొన్నారు.

కరెన్సీ కింగ్

ఒక్కొక్కరు ఒక్కో రంగంలో రాణిస్తుంటారు.. వారి అభిరుచులు, ఆలోచలనకు అనుగుణంగా మసలుకొని మన్ననలు కూడా అందుకుంటారు. కొందరు కళారంగంలో రాణిస్తుంటే .. ఇంకొందరు వారు ఎంచుకున్న రంగంలో ప్రతిభ కనబరుస్తారు. ప్రశంసలు కూడా అందుకుని ఆదర్శంగా నిలుస్తారు. అదే కోవకు చెందుతారు వడ్లపూడిలోని ఆర్.హెచ్.కాలనీకి ఏఎంసత్యనారాయణ చెందుతారు. అన్నిరంగాలకు భిన్నంగా నాణేలు, కరెన్సీ సేకరించడం హాబీగా పెట్టుకున్నారు. - కూర్మన్నపాలెం

- 120 దేశాల నాణేలు, కరెన్సీ సేకరణ
- ఆల్బమ్ రూపకల్పన
- కరెన్సీ కోసం రూ. 10 లక్షల ఖర్చు
- భావితరాలకు తెలియజేయడమే లక్ష్యం
- ప్రశంసలు అందుకుంటున్న సత్యనారాయణ



అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

చిన్నప్పుడు కలిగిన ఆకాంక్షను ఆయన కొనసాగిస్తున్నాడు. లక్షలాదిరూపాయలు వ్యయం చేసి దేశ,విదేశీ కరెన్సీతోపాటు రెండు శతాబ్దాల కిందట నుంచి వాడుకలో ఉన్న నాణేలను సేకరిస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు. ఐటీఐ చేసిన సత్యనారాయణకు ఉద్యోగం రాకపోవడంతో వడ్లపూడి మెయిన్‌రోడ్డులో టెంటుహౌస్ పెట్టి జీవనం సాగిస్తున్నారు. ఒక వైపు వ్యాపారంలో



ఆస్ట్రేలియాలో పిచ్చుకలతో విడుదల చేసిన నాణేం

నిమగ్నమవుతూనే మరో నాణేలు, కరెన్సీ సేకరించి వాటిని పదిలపర్చుతున్నారు. భావి తరాల వారికి మన పూర్వీకులు ఏ నాణేలు వాడారు.. అవి ఏరూపంలో ఉండేవో తెలియజెప్పాలన్న ఉద్దేశంతో సత్యనారాయణ కరెన్సీ సేకరణకు శ్రీకారం చుట్టారు. సుమారు 25 ఏళ్ల నుంచి ఆయన కరెన్సీ సేకరిస్తున్నారు.

వెండి నాణేలు సైతం

వెండి నాణేలను కూడా సేకరించి వాటి విలువలను వివరిస్తున్నారు. పది రూపాలు,150 రూపాలు, 250 రూపాలు, 1000 రూపాలు నాణేలను ప్పించుకొని ఇప్పటి వారికి వాటిని తెలియపర



అమెరికా కరెన్సీ డాలర్



భారతదేశంలో 5 రూపాయల నోటు చిత్రాలు

120 దేశాల కరెన్సీ సేకరణ

25 ఏళ్ల కిందట ఈ సేకరణను ప్రారంభించిన ఆయన ఇప్పటికి 120 దేశాల్లో వాడుకలో ఉన్న నాణేలను సేకరించారు. వాటితో ఆల్బమ్ తయారు చేశారు. అంతేకాకుండా భారతదేశంలో 1803 సంవత్సరం ముందే ఏ నాణేలు చెల్లుబాటులో ఉండేవి.. వాటి విలువ తదితర అంశాలను సేకరించారు. 1803 నుంచి 1930 మధ్య గవ్వలు వాడుకలో ఉండేవని ఆయన సేకరించిన సమాచారం వల్ల తెలుసుకున్నారు. అప్పట్లో 128 గవ్వల విలువ ఒక్క రూపాయిగా ఉండేది. ఆ తర్వాత తౌలీలు, దమ్మిడీలు, కాసులు, గుర్రం కాసులు, కన్న కాసులు, ఆదికాసులు, అణాలు, అర్ధనాలు, పావలాలు, అర్ధ రూపాయలు, రూపాయలు ఏ సంవత్సరం నుంచి ఏ సంవత్సరం వరకు వాడారు.. వాటి విలువ ఎంత అన్న విషయాలు తెలుసుకొని ఇప్పటి పిల్లలకు తీరిక సమయాల్లో వివరిస్తున్నారు.



సేకరించిన దమ్మిడీలు, గవ్వలు



సేకరించిన వివిధ దేశాల నాణేలు

చుతున్నారు. ఎ నుంచి జెడ్ వరకు ఉన్న దేశాల్లో వాడుకలో ఉన్న నాణేలు ఆయన వద్ద ఉన్నాయి. 25 ఏళ్లుగా కరెన్సీ సేకరించడంతో అనేక స్వంచ్ఛంద సంస్థలు ఆయన్ను సన్మానించి బహుమతులు అందించాయి.

పూర్వీకుల జీవన విధానం తెలుసుకోవాలనే..



మన పూర్వీకుల జీవన విధానం.. అప్పటి నగదు వాడుక గుంచి తెలుసుకోవాలన్న ఉద్దేశంతో నాణేల సేకరణకు శ్రీకారం చుట్టాను. ఇప్పటి వరకు రూ.10 లక్షలు ఖర్చు పెట్టి వివిధ దేశాల్లో వాడుకలోఉన్న కరెన్సీతోపాటు భారతదేశంలో రిజర్వుబ్యాంక్ విడుదల చేసిన ప్రతి నోటు కొనుగోలుచేసి భద్రపర్చాను. వివిధ సందర్భాల్లో విడుదల చేసిన నాణేలను కూడా తీసుకున్నాను. విదేశాల్లో కూడా పక్షులమీద కొన్ని కాయిన్స్‌ను విడుదల చేశారు. వాటిని కూడా అతి కష్టంమీద తెప్పించాను.

–ఎస్.ఎం.సత్యనారాయణ
నాణేల ప్రేమికుడు, వడ్లపూడి

వైఎస్సార్‌టీయూసీ నాయకులకు సత్కారం



పదవీ విరమణ చేయనున్న వారిని సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు కూటికుప్పల జనార్దన్, జె. విజయకుమార్, వై. నూకరాజులు ఈనెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా మంగళవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద యూనియన్ నాయకులు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు యూనియన్ కోసం చేసిన సేవలను కొనియాడారు. వారి శేషజీవితం ఆనందదాయకంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు నక్క వెంకటరమణ, మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, బి. శశిభూషణరావు, దరిగి రవి, ఆసా అప్పలరెడ్డి, ధర్నాల అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాటర్ బాటిళ్ల పంపిణీ

ఇప్పటి వరకు 7,200 మందికి కూలింగ్ వాటర్



వాటర్ బాటిళ్లను ప్రయాణికులకు అందిస్తున్న ఈశ్వరరావు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ మీదుగా భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్లే సాధారణ రైలు ప్రయాణికుల దాహం తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీ కార్యక్రమం 24వ రోజూ కొనసాగింది. మంగళవారం మధ్యాహ్నం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లోని సాధారణ, మహిళా, దివ్యాంగుల బోగీల్లోని 250 మంది ప్రయాణికులు వీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా తూర్పు కోస్తా రైల్వేజోనల్ కన్సల్టెటివ్ కమిటీ సభ్యుడు కె.ఈశ్వర్, మానవ వికాస వేదిక ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ ఇప్పటి వరకు 7,200 మందికి మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆదిల్ రెహ్మాన్, పి.శ్రీనివాస్, భాస్కరరాజు, నాగేశ్వరరావు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల పండగ

పెదగంట్యాడ: మండలంలోని బర్మాకాలనీ ప్రాంతంలో వేంచేసిన మర్రిమాంబ, మోదకొండమ్మ అమ్మవార్ల పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. వేకువజాము నుంచి ఆలయం వద్ద భక్తుల సందడి కనిపించింది. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి శంకరనారాయణ, గొందేశి శ్రీనివాసరెడ్డి, బొడ్డ గోవింద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. చీర సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు సమ్మంగి అప్పలరాజు వరలక్ష్మి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



విజయకనకదుర్గమ్మను దర్శించుకుంటున్న తిప్పల దేవన్‌రెడ్డి, తదితరులు

ఘనంగా విజయ కనకదుర్గ అమ్మవారి పండగ

జీవీఎంసీ 65వ వార్డు పరిధి బాపూజీ కాలనీలో మంగళవారం విజయ కనకదుర్గ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి,వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాల శ్రీనివాసరావు, గొందేశి శ్రీనివాసరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు.

వీరేశలింగం పంతులు సేవలు అజరామరం

గాజువాక: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం 106వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ తుంపాల శ్రీరామ్మూర్తి తదితరులు వీరేశలింగం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కరణ కార్యక్రమాల్లో వీరేశలింగం పంతులు నిర్వహించిన కృషిని చిన్నారులకు వివరించారు. బాల్య వివాహాలను రూపుమాపారని, వితంతు వివాహాలను జరిపించారని, బాలికలు చదువుకోవడాన్ని ప్రోత్సహించారని తెలిపారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే ప్రస్తుత కాలంలో అనేక మంది అమ్మాయిలు అనేక రంగాల్లో ప్రతిభ చూపగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



వీరేశలింగం పంతులు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న శ్రీరామ్మూర్తి తదితరులు

పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

పెదగంట్యాడ: అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు.ఈ మేరకు పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు దాటినా ఇంతవరకు ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదన్నారు. వందలాది పేద కుటుంబాలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్-6 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె. వనజాక్షి, ఆనంద్, అచ్యుత్‌రావు, సూర్యపద్మ తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

దళితులపై దాడులు దారుణం



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

సీతంపేట: దళితుల బడ్జెట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో మూడు లక్షల మంది ఎస్సీ జనాభా ఉంటే, ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లు కేవలం నాలుగు వందల యూనిట్లు కేటాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. మంత్రులు ఉన్న నియోజకవర్గాలలో దళితులపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని, పిఠాపురం, పాయకరావుపేట, తెనాలి నియోజకవర్గాల్లో దళితులపై దాడులు జరిగాయన్నారు. దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. దళితుల రక్షణకు ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజులు, గుడాల రాంబాబు, పిల్లి వీర్రాజు, ఎస్‌ఏడీ రాజ్, శ్రీనివాస్, పిల్లి రాము, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి పూర్ణ మహాగణాధిపతి ప్రతిష్టాపన మహోత్సవాలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి దరి అన్నపూర్ణానగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీపూర్ణ మహాగణాధిపతి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు వచ్చేనెల 3 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను మంగళవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ దానబాల సన్యాసిరావు మాట్లాడుతూ 3,4 తేదీల్లో విగ్రహ శిఖర కలశ ప్రతిష్టా మహోత్సవం, 5న విగ్రహ ప్రతిష్టా మహోత్సవం చేపట్టడం జరుగుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం విశేష అన్న సమారాధన నిర్వహించనున్నామనితెలిపారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, వీఆర్‌సీ మూర్తి, మామిడి అప్పారావు, దొడ్డి దేముడు, గోపిశెట్టి అప్పారావు, శ్యామ్‌సన్, నాగేశ్వరరావు, మురళి పాల్గొన్నారు.



అన్నపూర్ణానగర్‌లో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

సీతారాముల ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న భాగ్యపైడిరాజు దంపతులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకలో సీతారామాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన గొల్లవిల్లి భాగ్య పైడిరాజు (వీడియోరాజు) దంపతులు రూ. 25,201 విరాళంగా అందించారు. అలాగే వివిధ దాతల నుంచి సేకరించిన రూ.21,640 లను ఆలయ కమిటీ చైర్మన్ విందుల నారాయణరావుకు ఆఅందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఆలయం పురాతనమైనది కావడంతో గ్రామస్తులు, ఆలయ కమిటీ, నిర్మాణ కమిటీలు సంయుక్తంగా ఆలయ పునర్నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుదే సుశీలా గజేంద్రరావు, కమిటీ ప్రతినిధులు విందుల సతీష్, బలిరెడ్డి అప్పలనాయుడు, విందుల రాజు, గుదే లక్ష్మణ్, దానబాల రాజేష్, చిన్నారావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్ కలాసీలకు టైం స్కేల్ అమలుకు హామీ



పోర్టు కార్యాలయం ముందు హర్షం వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు, కలాసీలు

జగదాంబ: విశాఖ పోర్ట్ పూల్ కలాసీలకు టైం స్కేల్ అమలు చేస్తామని పోర్ట్ చైర్మన్ హామీ ఇచ్చారని పూల్ కలాసీల జిల్లా అధ్యక్షుడు పరుశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోర్టు పూల్ కలాసీలతో కలిసి చైర్మన్‌తో మాట్లాడి వినతిపత్రం అందజేశారు. కలాసీలు పోర్ట్‌ను నమ్ముకుని చాలా కాలంగా జీవిస్తున్నారని తెలిపారు. వారందరికీ టైం స్కేల్, మెడికల్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ కలాసీలకు టైం స్కేల్ అమలు చేస్తామని హామీ ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పీఎఫ్ ఎంట్రీలో లోపాలు సవరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం: భెల్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం పీఎఫ్ (అదాలత్) నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ 1992 నుంచి వివిధ సీరీస్‌లో జాయిన్ అయిన ఉద్యోగులకు డేట్ ఆఫ్ జాయినింగ్ సరిగ్గా లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి కారణం పీఎఫ్ అధికార యంత్రాంగమే అన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఉద్యోగుల డేట్‌ఆఫ్ జాయినింగ్ సరిచేసి తగిన విధంగా పెన్షన్ వచ్చేలా చేయాలని కోరారు. అలాగే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన హయ్యర్ పెన్షన్ రాలేదని, ఆ పెన్షన్లు అప్లై చేసిన ఉద్యోగులకు రిటైర్ అయినట్లు మెయిల్స్, మెసేజ్‌లు వచ్చాయని, ఇది చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. భెల్ ఇతర యూనిట్లలో హయ్యర్ పెన్షన్ వస్తుందని, విశాఖ పట్నం యూనిట్లో రాకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై పీఎఫ్ అధికారులు విశ్వనాథ్, వైభవ్, శివశంకర్ తదితర అధికారులకు సీఐటీయూ నాయకులు జి.టి.పి.ప్రకాష్, సీతన్నాయుడు, ఎస్.జగన్నాథరావు, పి.ఆనందకుమార్, కె.నారపురెడ్డి, అల్లు అప్పారావు, జి.అచ్చంనాయుడు తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు.



పీఎఫ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న భెల్ సీఐటీయూ నాయకులు

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

పరవాడ: యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సాధ్యమని, యోగాను ప్రతి ఒక్కరు దినచర్యగా చేసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతంలో జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా వెయ్యి మంది యోగా అభ్యాసకులతో మంగళవారం యోగాసనాల ముందస్తు సన్నద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌లు పాల్గొని యోగాసనాలు చేశారు. అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో 25 మంది యోగా గురువులు, 100 మంది మాస్టర్ ట్రైనీలతో 4,500 మంది సచివాలయ సిబ్బందికి వివిధ యోగాసనాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి గ్రామానికి వెళ్లి, రోజుకు 50 మంది చొప్పున ఐదు రోజుల పాటు క్రమం తప్పకుండా రోజుకో యోగాసనం వేసేలా శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ రోజూ ఓ గంట పాటు యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి తగ్గి, ప్రశాంతత లభిస్తుందన్నారు. రోజంతా ఉత్సాహంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి అనిత, మండల ప్రత్యేక అధికారి సరోజిని, సర్పంచ్ చింతకాయల సుజాత, ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాలకు చెందిన అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



యోగాసనంలో కలెక్టర్